సాక్షి
మెదక్
ఆదివారం । 31 । మార్చి । 2024




న్యాయవాది పాత్ర కీలకం

సమాజంలో న్యాయవాది పాత్ర కీలకమైందని టీఎస్ లాసెట్ కన్వీనర్ విజయలక్ష్మి అన్నారు. వివరాలు 8లో ▸



సాగునీరు వదిలేదిలేదు

చెన్నాయిపల్లి రైతుల పంటలకు సాగునీరు అందించేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వివరాలు 9లో ▸



మణికట్టు మణిహారం చేతి గడియారం.. మధుర జ్ఞాపకాలు కలకాలం గుర్తుండిపోయేలా చేసే కెమెరా.. పాటలు వినిపించే టేప్ రికార్డర్.. కాలాన్ని పదిలపర్చిన డైరీ.. సుదూర ప్రాంతాల నుంచి బంధుమిత్రుల క్షేమ సమాచారం మోసుకొచ్చే ఉత్తరం.. చిమ్మ చీకటిలో దారిచూపే టార్చిలైట్.. తరతరాలుగా ఎన్నో ముచ్చట్లు మోసుకొచ్చిన రేడియో.. ఎంతటి కఠినమైన లెక్కలనైనా పరిష్కరించే క్యాలిక్యులేటర్.. ఒకటేమిటి ఇలా ఎన్నో ఉపకరణాలను కనుమరుగు చేస్తోంది మొబైల్ ఫోన్. ఇవే కాదు వెండితెర, బుల్లితెర, రైల్వే, బ్యాంక్ కౌంటర్, ఏటీఎంలను ఇమడ్చుకుని మరిన్ని ఉపకరణాల కోసం ఎదురుచూస్తున్న అరచేతి ప్రపంచం మొబైల్ మాయాజాలంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

అరికెల శ్రీనివాస్
వెల్దుర్తి (తూప్రాన్)

• అరచేతిలో ఆ 'పాత' మధురం

ఆల్ ఇన్ 1



- అన్నింటికీ 'మొబైల్' ప్రత్యామ్నాయం
- సకల సేవల సమాహారం
- మూలనపడిన పలు ఉపకరణాలు
- కాలచక్ర గమనంలో కనుమరుగు

సండే స్పెషల్



గడియారం టైమ్ బాగో లేదు

ఒకప్పుడు చేతికి వాచీ ఉంటే అదో స్టేటస్ సింబల్. కానీ సెల్‌ఫోన్ రాకతో దీనికి ఆదరణ తగ్గింది. కొందరు మాత్రమే ఇప్పుడు చేతి గడియారాలు వాడుతున్నారు. సెల్‌ఫోన్‌లోనే సమయంతో పాటు తేదీ, నెల, సంవత్సరం, తిథి, వారం, నక్షత్రాలు వస్తుండడంతో పూర్తిగా పాత ఉపకరణాలను మర్చిపోయే పరిస్థితి నెలకొంది.

క్యాలిక్యులేటర్ కాలం చెల్లు



చిన్నపాటి లెక్కల కోసం మెదడుకు పని పెట్టకుండా కాగితం, పెన్ను ఉపయోగించకుండా అందుబాటులోకి వచ్చిన క్యాలిక్యులేటర్‌కు కాలం చెల్లింది. సెల్‌ఫోన్లలోనే ఈ ఆప్షన్ ఉండడంతో క్యాలిక్యులేటర్ వాడకుండా ఫోన్‌లోనే లెక్కలు చేస్తున్నారు.



కెమెరాలకు తగ్గిన క్రేజ్



విహారయాత్రలు, వేడుకల సందర్భంగా కెమెరా సాయంతో ఫొటోలు, వీడియోలు తీసి తీపి గుర్తుగా భద్ర పరుచుకునేవారు. ప్రస్తుతం సెల్‌ఫోన్లలోనే కెమెరా ఇమిడిపోయింది. ఒక్క క్లిక్‌తో నచ్చిన దృశ్యాన్ని సెల్‌ఫోన్‌లో బంధించడమే కాకుండా వెంటనే అనేక మార్గాల ద్వారా డిజిటల్ గ్రాఫిక్స్‌తో ఫొటోలు డిజైన్ చేసి అందంగా ముస్తాబు చేయడం వరకు సెల్‌ఫోన్‌లో ఉన్నాయి. ఫొటో తీసిన వెంటనే ఇతరులతో పంచుకోవడానికి కూడా అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం పెళ్లిళ్లు, శుభకార్యాలు, వేడుకలకు మెరుగైన నాణ్యత, కమర్షియల్ అవసరాల కోసం మాత్రమే డిజిటల్, వీడియో కెమెరాలు వాడుతున్నారు.

డైరీలు వాడే వారేరి..?



రోజువారీ కార్యక్రమాలను నిక్షిప్తం చేయడమే కాకుండా ముఖ్యమైన విషయాలకు డైరీ ఎంతో అవసరం. మొబైల్ రిమైండర్‌లోనే నెలవారీ ప్రణాళికలు, సమాచారం రాసి పెట్టుకోవడానికి మెమో రికార్డులు అందుబాటులోకి వచ్చాయి. కావాల్సినప్పుడు గుర్తు చేయడానికి రిమైండర్ ఆప్షన్ ఉండనే ఉంది. ఒకప్పుడు నిత్య జీవితంలో ముఖ్య భాగంగా ఉన్న ఆనాటి పాతతరం పరికరాలెన్నో ఉండేవి. ఇప్పుడు మొబైల్ ఫోన్ రాకతో తీపి జ్ఞాపకాలుగా మిగిలిపోతున్నాయి. ఇప్పుడు బ్యాంకింగ్, టికెటింగ్, అప్లయింగ్ లాంటి ప్రక్రియలను తనలో ఇమడ్చుకొని సెల్‌ఫోన్ ఆల్ ఇన్ వన్‌గా మారిపోతుంది.

మూగబోయిన టేప్ రికార్డర్



ఒకప్పుడు తెల్లవారిందంటే ఇళ్లు, వీధుల్లో టేప్ రికార్డర్ పాటలు వినిపించేవి. భక్తి సినిమా పాటలు, కథలతో హుషారెత్తించేది. అప్పట్లో ప్రతి ఇంటికి తప్పనిసరిగా టేప్ రికార్డర్ ఉండేది. వాటిని ఇప్పుడు అటకెక్కించారు. తొలుత టేప్ రికార్డర్‌ను మింగేసింది సీడీ ప్లేయర్. వాటిని తోసేసి డీవీడీ ప్లేయర్, డిజిటల్ ప్లేయర్లు వచ్చాయి. వీటన్నింటిని మొబైల్‌ఫోన్ పక్కకు నెట్టివేసింది. సెల్‌ఫోన్ ఉంటే చాలు పాతకాలం నాటి మధురమైన పాటల నుంచి మొదలు నేటి సినిమా పాటల వరకు అన్నీ నెట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని సెల్‌ఫోన్ ద్వారా వింటున్నారు. దీంతో అలనాటి టేప్ రికార్డర్, సీడీ, డీవీడీ ప్లేయర్ వరకు పరికరాలు అటకెక్కాయి.

వెలగని టార్చిలైట్



చిమ్మ చీకట్లో బయటకు వెళ్లడానికి, వస్తువులు వెతకడానికి గతంలో అందరి ఇంట్లో టార్చిలైట్ ఉండేది. ఇప్పుడది ప్రత్యేకంగా కనిపించకుండా పోయింది. రాత్రిపూట పంట పొలాలకు వెళ్లేందుకు మాత్రమే రైతులు టార్చిలైట్ వాడుతున్నారు. ప్రస్తుతం ప్రతి ఇంటికి రెండు, మూడు మొబైల్ ఫోన్లు ఉన్నాయి. టార్చిలైట్లు కొనేవారు కరువయ్యారు.

ఉత్తరాలు కనుమరుగు



గతంలో సమాచారం చేరవేయడానికి ఉత్తరాలే ఆధారం. కాలక్రమంలో ల్యాండ్‌ఫోన్లు వచ్చినా అవి అందరికీ అందుబాటులో ఉండేవి కావు. పోస్టుకార్డులు, ఇన్‌లాండ్ లెటర్లు, ఎన్వలెప్ కవర్లు.. ఇలా అనేక రూపాల్లో ఉత్తరాలు పంపించుకునేవారు. ఇప్పుడవన్నీ పాత జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత ఎస్ఎంఎస్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, స్కైప్, టెలీగ్రామ్, మెసెంజర్ అంటూ రకరకాల యాప్స్‌తో ఫోన్ నుంచి అన్నిరకాల సమాచారం క్షణంలో ప్రపంచం నలుమూలలకు వెళ్లిపోతున్నాయి. దీంతో ఉత్తరాలకు ఇప్పుడు ఆదరణ పూర్తిగా తగ్గింది.

లెక్కలన్నీ 'సెల్‌ఫోన్'లోనే



వెల్దుర్తిలో సుమారు 30 ఏళ్లుగా హార్డ్‌వేర్ షాపు నడుపుతున్నా. గతంలో సామగ్రి విక్రయానికి సంబంధించిన లెక్కలు క్యాలిక్యులేటర్‌లో చేసేవాడిని. ప్రస్తుతం సెల్‌ఫోన్‌లోనే చేస్తున్న. వినియోగదారుల ఖాతాలు సైతం ఖాతాబుక్ యాప్‌లో నమోదు చేసుకుంటున్న.

– రమేశ్‌గుప్తా, వ్యాపారి

ఫొటోగ్రఫీని వదులుకున్నా..



వెల్దుర్తిలో సుమారు రెండు దశాబ్దాలకు పైగా ఫొటో స్టూడియో నడిపించా. చిన్న చిన్న ఫంక్షన్లతో పాటు పాస్ ఫొటోల కోసం ప్రజలు వచ్చేవారు. సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత గిరాకీ పడిపోయింది. తప్పని పరిస్థితిలో ఫొటోగ్రఫీని వదిలి టెంట్‌హౌస్ పెట్టుకున్న.

– శ్రీధర్, వెల్దుర్తి

ప్రతి ఇంట్లో రేడియో ఉండేది



టీవీలు, సెల్‌ఫోన్ల వాడకం తక్కువగా ఉన్న సమయాల్లో ప్రతి ఇంట్లో రేడియో ఉండేది. వార్తలతో పాటు భక్తిగీతాలు, సినిమా పాటలు ఆసక్తిగా వినేవాళ్లం. ప్రస్తుతం సెల్‌ఫోన్‌లోనే ఆడియో, వీడియో పాటలతో పాటు కోరుకున్న పాటలు, చిత్రాలు వీక్షించే అవకాశం ఉండడంతో రేడియో వాడకం పూర్తిగా తగ్గిపోయింది.

– మహిపాల్‌రెడ్డి, ఆరెగూడెం

బ్యాటరీల వాడకం తగ్గింది



పంటపొలాల వద్దకు రాత్రి సమయాల్లో వెళ్లడానికి అప్పట్లో బ్యాటరీలు పట్టుకెళ్లేవాళ్లం. ప్రస్తుతం సెల్‌ఫోన్‌లోనే టార్చిలైట్ ఉండడంతో వాటినే వినియోగిస్తున్నాం.

– నర్సింలు, రైతు, వెల్దుర్తి

న్యూస్‌రీల్

జిల్లా మైనింగ్ ఏడీగా ప్రవీణ్



మెదక్ కలెక్టరేట్: జిల్లా మైనింగ్ ఏడీగా ప్రవీణ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇప్పటి వరకు పనిచేసిన జయరాజ్ వరంగల్‌కు బదిలీపై వెళ్లగా రంగారెడ్డి జిల్లా నుంచి ప్రవీణ్ బదిలీపై ఆయన స్థానంలో ఇక్కడికి వచ్చారు.

నేడు యథావిధిగా సేవలు

మెదక్ కలెక్టరేట్: 2023– 2024 ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో కలెక్టరేట్‌లోని ఖజానా కార్యాలయంలో ఆదివారం యథావిధిగా సేవలు కొనసాగుతాయని జిల్లా ఖజానా అధికారి చిన్నసాయిలు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బడ్జెట్ బిల్లులు, ఉద్యోగుల జీతాలు, చెక్కుల జమ లాంటివి చూస్తామన్నారు. నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ కార్యాలయాల్లో సైతం సేవలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఎండిన పంటల వివరాలు సేకరిస్తున్నాం

నర్సాపూర్ రూరల్: జిల్లావ్యాప్తంగా ఎండిన పంటల వివరాలు సేకరిస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. శనివారం మండలంలోని పెద్దచింతకుంటలో ఎండిన వరి పంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నష్ట వివరాలను పూర్తిస్థాయిలో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బోరు బావుల్లో నీరు తగ్గిపోయి పంటలు ఎండినట్లు పేర్కొన్నారు. రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో భూగర్భజల శాఖ అధికారిణి లావణ్య, మండల వ్యవసాయ అధికారి అనిల్, ఏఈఓ శిరీష పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

నర్సాపూర్ రూరల్: నిరంతరం రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు అందుబాటులో ఉంటూ వైద్యసాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయ నిర్మల, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

అధికారులతో అదనపు కలెక్టర్ రమేశ్ సమీక్ష



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

తూప్రాన్/చేగుంట(తూప్రాన్): వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ రమేశ్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో మండలంలోని ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు నీటి కొరతతో ఇబ్బంది పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే ఇంటి పన్ను వందశాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహిజోద్దీన్, డీఎల్‌పీఓ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే చేగుంట ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. నీటి ఎద్దడి నివారణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.



ఘనంగా రన్‌ఫర్ జీసస్

మెదక్‌జోన్: పట్టణంలో శనివారం ప్రధాన వీధుల గుండా క్రైస్తవులు జీసస్ ర్యాలీ నిర్వహించారు. పాపుల రక్షణ కోసం గుడ్‌ఫ్రైడ్ రోజు ఏసుక్రీస్తు శిలువ వేయగా.. ఆ మరుసటి రోజు ప్రభువుకు మొరపెట్టుకునేందుకు ర్యాలీ నిర్వహిస్తారని మతపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్యతో పాటు పలువురు మత పెద్దలు, యువత పాల్గొన్నారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి

కలెక్టర్ రాహుల్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

మెదక్ కలెక్టరేట్: రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రకటనలు ప్రసారం చేయవద్దని.. అలాంటి వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంతకుముందు జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ముద్రించినప్పుడు, ప్రచురించినప్పుడు తప్పనిసరిగా ప్రింటర్, ప్రచురణ కర్త పేర్లు, చిరునామా, సెల్‌ఫోన్ నంబర్లు ప్రింటింగ్‌లో స్పష్టంగా సూచించాలని ఆదేశించారు. ప్రింట్ చేసిన మూడు రోజుల్లోపు ప్రచరణ కర్త నుంచి పొందిన డిక్లరేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

రేపటి నుంచి పోలీస్ యాక్ట్ : ఎస్పీ



మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 1వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ డాక్టర్ బాలస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ అధికారుల అనుమతి లేకుండా జిల్లాలో ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలు గడ్డం రాములు, మల్లయ్యను ఘనంగా సన్మానించారు.

హమ్మయ్య.. పరీక్షలు ముగిశాయి


పాపన్నపేట(మెదక్): పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లావ్యాప్తంగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు మొత్తం 10,334 మందికి గానూ 10,308 హాజరు కాగా 26 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థుల హాజరు శాతం 99.75 శాతంగా నమోదైంది. ఈసారి ఒక్క మాల్ ప్రాక్టీస్ కేసు కూడా బుక్ కాలేదు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. సోమవారం 13 కేంద్రాల్లో 1,264 మంది ఒకేషనల్ పరీక్ష రాయనున్నారని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. జిల్లాలో 68 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా తూప్రాన్, మాసాయిపేటలో గల ఆరు పరీక్ష కేంద్రాలను డీఈఓ సందర్శించారు. ఈసారి ఎండలు తీవ్రంగా ఉండడంతో కొంతమేర విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. కాగా ఇంటర్ మీడియెట్ కోసం ఇప్పటి నుంచే విద్యార్థులు వారి తల్లిదండ్రులు కాలేజీల అన్వేషణ ప్రారంభించారు.



ఆనందోత్సాహంలో విద్యార్థులు

బాబ్బాబ్బ..!

- ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్న బీఆర్ఎస్ నేతలు
- వారి వెంట వెళ్లకుండా క్యాడర్‌ను కాపాడుకునే ప్రయత్నం
- స్వయంగా బుజ్జగింపులు మొదలు పెట్టిన హరీశ్
- ఉమ్మడి జిల్లాలో మారుతున్న సమీకరణాలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : వరుస వలసలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బీఆర్ఎస్ పార్టీ నష్ట నివారణ చర్యలు చేపట్టింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో కీలక నేతలు, ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నారు. ఇలా పార్టీకి గుడ్‌బై చెప్పిన నాయకుల వెంట వారి అనుచరులు వెళ్లిపోకుండా క్యాడర్‌ను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం స్వయంగా మాజీ మంత్రి హరీశ్‌రావు రంగంలోకి దిగారు. స్వయంగా క్యాడర్‌తో మాట్లాడుతున్నారు. క్యాడర్‌ను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

మదన్‌రెడ్డి వెంట వెళ్లకుండా..

మెదక్ జిల్లా నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే, కేసీఆర్‌కు స్నేహితుడు చిలుముల మదన్‌రెడ్డి పార్టీని వీడటం ఖాయమైంది. ఇప్పటికే ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఏప్రిల్ మొదటి వారంలో కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడలో నిర్వహించనున్న భారీ బహిరంగసభలో మదన్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకునే అవకాశాలున్నాయి. ఆయన వెంట బీఆర్ఎస్ క్యాడర్ వెళ్లకుండా హరీశ్ అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. స్వయంగా మండల నాయకులతో ఫోన్లో మాట్లాడారు. కష్ట కాలంలో పార్టీకి అండగా ఉన్న నాయకులకు మంచిరోజులు వచ్చాక ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇస్తున్నారు. ఇప్పటికే హత్నూర జెడ్పీటీసీ పి..ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. నర్సాపూర్ నియోజకవర్గంలో పలు గ్రామాల సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు మదన్‌రెడ్డి వెంట కాంగ్రెస్‌లో తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ నేపథ్యంలో పార్టీని వీడే అవకాశాలున్న వారితో హరీశ్‌రావు భేటీ అవుతున్నారు. ఓ మండల స్థాయి నాయకుడికి అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడనున్న నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తామని హామీ కూడా ఇచ్చినట్లు సమాచారం.

గజ్వేల్, సంగారెడ్డిల్లో..

మెదక్ ఎంపీ టిక్కెట్ ఆశించి భంగపడిన వంటేరు ప్రతాప్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని ప్రకటించిన వెంటనే ప్రతాప్‌రెడ్డి సైలెంట్ అయ్యారు. ఆయన కూడా శనివారం గజ్వేల్ నియోజకవర్గ ముఖ్యనేతల సన్నాహక సమావేశంలో పాల్గొనడం గమనార్హం. ఇక్కడ ఇప్పటికే ఎలక్షన్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రతాప్‌రెడ్డి తిరిగి బీఆర్ఎస్‌లో యాక్టివ్ అయ్యారు. ఇటు సంగారెడ్డి మున్సిపాలిటీకి చెందిన ప్రజాప్రతినిధులు కూడా ఒకరిద్దరు పార్టీ మారే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో హరీశ్ వారితో మాట్లాడి పార్టీని వీడొద్దని బుజ్జగించినట్లు సమాచారం. త్వరలోనే కొందరు కౌన్సిలర్లు గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

బీబీ పాటిల్ వెంట వెళ్లకుండా..

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ తొలుత బీఆర్ఎస్‌ను వీడారు. బీజేపీ కండువా కప్పుకుని ఆ పార్టీ టికెట్‌ను పొందారు. అయితే ఆయన బీఆర్ఎస్‌ను వీడినప్పుడు చెప్పుకోదగిన నేతలెవరూ ఆయన వెంట వెళ్లలేదు. పాటిల్‌కు బీఆర్ఎస్‌లో పెద్దగా క్యాడర్ లేదు. కానీ తర్వాత మాజీ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ వంటి నాయకులు ఒకరిద్దరు బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఇలా పార్టీ క్యాడర్‌ను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ అన్ని ప్రయత్నాలు చేస్తుండటం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

రాజేష్ ఖన్నాకు డాక్టరేట్


రాజేష్‌ఖన్నా

పెద్దశంకరంపేట (మెదక్): మండలంలోని మల్కాపూర్‌కు చెందిన బూత్కూరి రాజేష్ ఖన్నాకు శనివారం జేఎన్‌టీయూహెచ్ (జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్) డాక్టరేట్ ప్రకటించింది. ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ డ్రైవ్స్ స్పెషలైజేషన్‌లో చేసిన పరిశోధనలు చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ డాక్టర్ పూనమ్ ఉపాధ్యాయ, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల రికవరీ



సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా పోలీసులు గుర్తించి బాధితుడికి అప్పగించారు. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఖాజా ఈనెల 12న సాజిద్‌పుర వెళుతుండగా తన సెల్‌ఫోన్ పొగొట్టుకున్నాడు. దీంతో అతడు సిద్దిపేట టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ యాప్‌లో వివరాలు నమోదు చేసి సెల్‌ఫోన్ గుర్తించి బాధితుడికి అప్పగించారు.

మిరుదొడ్డి(దుబ్బాక)లో..

అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ గ్రామానికి చెందిన చుంచు నాగరాజు అనే వ్యక్తి తన మొబైల్ ఫోన్‌ను అక్బర్‌పేట గ్రామంలో నెల రోజుల క్రితం పోగొట్టుకున్నాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు.



సండే స్పెషల్

మల్లయ్యల పల్లె

- మల్లన్న సాక్షిగా సార్థకమైన నామాలు
- గ్రామంలో 320మందికి అవే పేర్లు
- ప్రకృతి ఒడిలో పరిఢవిల్లుతున్న మల్లాయిపల్లి

ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఈ ఊరికి దైవభక్తి ఎక్కువ.. అంతేకాదు.. ఐక్యత, ప్రేమానురాగాలకు కేరాఫ్ అడ్రస్ కూడా. స్థానికంగా కొలువైన రేకులకుంట మల్లన్న దేవుడిపై ఉన్న భక్తితో మల్లయ్య, మల్లమ్మల పేర్లు పెట్టుకున్నారు. ఏ ఇంట చూసినా ఇవే పేర్లు కనిపిస్తాయి. అలాగే చిన్నమల్లన్న, పెద్ద మల్లన్న అంటూ ప్రేమగా పిలుచుకుంటారు. చుట్టూరా గుట్టలు.. దట్టమైన అడవి.. పక్షుల కిలకిలరావాల మధ్య ప్రకృతి రమణీయతకు నిలువెత్తు నిదర్శనమైన ఈ ఊరు పేరు కూడా మల్లాయిపల్లి. భక్తికి, ప్రేమానురాగాలకు నిలయమైన ఈ ఊరిపై ఈ ఆదివారం ప్రత్యేక కథనం మీ కోసం..

- గన్నె తిరుపతి రెడ్డి, దుబ్బాక

దుబ్బాక మండలంలో మల్లాయిపల్లి ఓ చిన్నపల్లెటూరు. ఇప్పుడు దుబ్బాక మున్సిపాలిటీలో చేర్చారు. దుబ్బాక పట్టణానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈగ్రామం చూడటానికి ఎంతో బాగుంటుంది. పూర్తిగా వ్యవసాయం పైనే ఆధారపడి ప్రజలు జీవనం కొనసాగిస్తుంటారు. ఊరిలో ఏ ఇంటిలో చూసినా మల్లయ్యపేర్లు ఉండటం ప్రత్యేకత. గ్రామంలో ఉన్న జనాభాలో ఎక్కువగా మల్లయ్య, మల్లారెడ్డి, మల్లేశం, మల్లవ్వల పేర్లే ఉండటం విశేషం. గ్రామంలో సుమారు 300 కుటుంబాల వరకు ఉంటాయి. ఇందులో 320 కి పైగా మల్లయ్య, మల్లమ్మ పేర్లే దర్శనమిస్తాయి. చాలా ఇళ్లల్లో తాత, తండ్రి, కొడుకుల పేర్లు కూడా మల్లయ్య పేర్లే. గ్రామంలో ఎక్కువ మందికి మల్లయ్య పేర్లు ఉండడంతో గ్రామస్తులు పెద్ద మల్లయ్య, చిన్న మల్లయ్య, బక్క మల్లయ్య, ఎర్ర మల్లయ్య అంటూ పిలుచుకుంటారు.

వ్యవసాయమే ఆధారం..

మల్లాయిపల్లిలో వంద శాతం వ్యవసాయం మీదనే ఆధారపడి ప్రజలు జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో ఎక్కువగా యాదవ కులస్తులు ఉన్నారు. వీరితో పాటుగా ముదిరాజ్, ఎస్సీలు, రెడ్డి, మంగలి, గౌడ, ఒడ్డెర కులస్తులు ఉన్నారు. గ్రామంలో 753 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, మరో వెయ్యి ఎకరాల మేర అటవీ విస్తీర్ణం ఉంది. పటేల్ చెరువు, కొత్తకుంట, నరేస్‌కుంట, పోరగాళ్లకుంట, పోచమ్మ కుంట, జాల పోరపు చెరువులు ప్రధాననీటి వనరులు.

620 మంది జనాభా

మల్లాయిపల్లిని ప్రస్తుతం దుబ్బాక మున్సిపాలిటీలో చేర్చి 1 వ వార్డు కింద ఉంచారు. 1995లో ఈ గ్రామం సిద్దిపేట నియోజకవర్గం పరిధిలో ఉండటంతో అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మాజీ సీఎం కేసీఆర్ గ్రామపంచాయతీగా మార్చారు. మొట్టమొదటి సారిగా సర్పంచుగా ఆసరుక్కవ్వ ఎన్నికయ్యారు. ఆ తర్వాత వేముల మల్లేశంగౌడ్ సర్పంచుగా ఎన్నికయ్యాడు. 3వ సారి కూడా మల్లేశంగౌడ్‌ను గ్రామస్తులు ఏకగ్రీవంగా సర్పంచుగా ఎన్నుకుని ఆదర్శంగా నిలిచారు. మల్లాయిపల్లిలో 620 కు పైగా జనాభా ఉండగా 410 మంది ఓటర్లు ఉన్నారు.

300 కుటుంబాలు.. 320 మంది మల్లయ్యలు..



మా గ్రామంలో 300 కు పైగా కుటుంబాలు ఉంటే 320 కి పైగా మల్లయ్య , మల్లేశం, మల్లవ్వల పేర్లే ఉంటాయి. కొన్ని ఇళ్లల్లో అందరూ మల్లన్న దేవుడి పేరువచ్చేలా పేర్లుపెట్టుకున్నారు.

- వేముల మల్లేశంగౌడ్, మాజీ సర్పంచ్ మల్లాయిపల్లి

దేవుడి పేరు ఉన్నందుకు సంతోషంగా ఉంది



మా ఊర్లో చాలామందివి మల్లన్న దేవుడి పేరుమీదనే పెట్టుకున్నారు. మల్లన్న దేవుడి పేరుమీదనే నా పేరు ఉండటం చాలా సంతోషంగా ఉంది. ఊరంతా ప్రేమానురాగాలతో, ఐక్యంగా ఉంటాం. - మల్లారెడ్డి, రైతు

మా తాతల పేర్లు కూడా ఇవే..



మా తాతలు, తండ్రుల నుంచి రేకులకుంట మల్లన్న దేవుడి పేరునే పెట్టుకున్నారు. మా కొడుకులు, మనవళ్లు, మనవరాళ్లకు కూడా ఇవే పేర్లు పెట్టాం. దేవుడుపై భక్తితో నే ఇలా తరాల నుంచి పేర్లు పెట్టుకుంటున్నాం. - దోరగొల్ల మల్లయ్య, మల్లాయిపల్లి

మా ఊర్లో ప్రతి ఇంట్లో మల్లయ్య



మా ఊర్లో ప్రతి ఇంట్లో మల్లయ్యనో.. మల్లేశమో.. మల్లవ్వనో తప్పకుండా ఉంటారు. మా ఇలవేల్పు రేకులకుంట మల్లికార్జునస్వామి మీద భక్తితో ఈ పేర్లు పెట్టుకుంటారు.ఊర్లో సగానికంటే ఎక్కువ గానే మల్లయ్యల పేర్లు ఉంటాయి.

- దోరగొల్ల చిన్నమల్లయ్య, మల్లాయిపల్లి

మల్లన్నదేవుడు వెలిసిన గ్రామం..

దుబ్బాక ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన రేకులకుంట మల్లికార్జునస్వామి.. మొట్టమొదటగా మల్లాయిపల్లివద్ద వెలిసాడని చెబుతారు. అప్పట్లో 'కోడి కూతలు'వినిపించాయని, దీంతో మల్లన్న స్వామి సమీపంలోని గుట్టలో కొలువుదీరానని స్థానికుల నమ్మకం. గ్రామంలోని ప్రజలు తమ ఇలవేల్పుగా మల్లన్నను కొలుచుకుంటున్నారు. అంతేకాదు.. దేవుడి పేరునే తమ పేర్లుగా పెట్టుకుంటున్నారు. ముఖ్యంగా గొల్లకురుమల ఆరాధ్యదైవం మల్లన్న కావడంతో వారి ఇళ్లల్లోనూ మల్లయ్య పేర్లున్న వారే కనిపిస్తారు.


రేకులకుంట మల్లికార్జునస్వామి ఆలయం

న్యాయవాదుల పాత్ర కీలకం

టీఎస్ లా సెట్ కన్వీనర్ ఓయూ విజయల విజయలక్ష్మి


మాట్లాడుతున్న విజయలక్ష్మి

పటాన్‌చెరు టౌన్: సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకమైందని టీఎస్ లా సెట్ కన్వీనర్ ఓయూ విజయలక్ష్మి అన్నారు. పటాన్‌చెరు మండలం ముత్తంగిలో శనివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో విశ్వ భారతి న్యాయ కళాశాల మొదటి, రెండో సంవత్సర విద్యార్థులు.. ఫైనలియర్ వారికి ఇచ్చిన వీడ్కోలు సమావేశానికి ఆమె, ఉస్మానియా విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్, చైర్మన్ బీటీఎస్ రామ్ ప్రసాద్, విశ్వభారతి లా కళాశాల కరస్పాండెంట్ రవి అనంతలు పాల్గొన్నారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ, న్యాయ వృత్తి ద్వారా ఎదిగేందుకు ఎన్నో అవకాశాలున్నాయని తెలిపారు. ప్రొఫెసర్ రాంప్రసాద్ మాట్లాడుతూ ముందుండి సహాయం చేసే అవకాశం అది ఒక్క లాయర్‌కే ఉందన్నారు. ముందుగా ముఖ్యఅతిథులతో లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని జ్యోతి ప్రజ్వలన చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గురుమూర్తి, వర్ష ,రమ్య, కీర్తి, అన్వి, పూనం, తేజశ్రీ, లా కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మోపెడ్‌పై నుంచి పడి ఒకరు.. ఆటో ఢీకొని మరొకరు..

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి


పోచమ్మ (ఫైల్)

ములుగు(గజ్వేల్): వేగంగా వెళ్తున్న బైక్ పై నుంచి పడి మహిళ మృతిచెందిన సంఘటన ములుగు మండలం అచ్చాయిపల్లిలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తప్పెట్ల పోచమ్మ(50) ఈ నెల 28న గ్రామం నుంచి డబుల్ బెడ్‌రూంల వైపు నడుచుకుంటూ వెళ్తోంది. అదే గ్రామానికి చెందిన యాదగిరి ఆపి టీవీఎస్ మోపెడ్‌పై ఎక్కించుకుని బయలుదేరాడు. వాహనాన్ని అతివేగంగా నడపడంతో ఆమె కింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే చికిత్స నిమిత్తం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు కార్తీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పటాన్‌చెరు టౌన్‌లో..

పటాన్‌చెరు టౌన్: ఆటో బైక్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం... రామచంద్రపురం వెలమెలకు చెందిన వెంకటయ్య(51) బీహెచ్ఈఎల్ సొసైటీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం బీహెచ్ఈఎల్‌కు బైక్‌పై వెళ్తుండగా నారాయణ కళాశాల సమీపంలో ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటయ్య తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగ్రాతుడిని చికిత్స కోసం హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాలు తనిఖీ


నర్సాపూర్ : రఘునందన్‌రావు కారును తనిఖీ చేస్తున్న అధికారులు


నర్సాపూర్ : నీలంమధు కారును తనిఖీ చేస్తున్న అధికారులు

నర్సాపూర్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నర్సాపూర్ హైదరాబాద్ జాతీయ రహదారిపై పట్టణ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద శనివారం ఇద్దరు లోక్‌సభ ఎంపీ అభ్యర్థుల వాహనాలు తనిఖీ చేశారు. బీజేపీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి రఘునందన్‌రావు, కాంగ్రెస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలంమధు కార్లను చెక్ పోస్టు వద్దకు రాగానే అధికారులు తనిఖీ చేసి పంపారు. చెక్ పోస్టు వద్ద విధుల్లో ఏఈ అర్వింద్, పోలీసు సిబ్బంది కిషన్, సురేష్, ప్రవీణ్ ఉన్నారు.

80 వేల నగదు పట్టివేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్థానిక చెక్ పోస్టు వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు నగదు పట్టుకున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు సమీపాన ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఒక వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 80 వేల నగదు తీసుకుని వెళ్తుంటే స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఎవరైనా సరే 50 వేలకు మించి డబ్బులు తీసుకుని వెళ్లవద్దని ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

వివిధ కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అందులో ఒకరు మహిళ కాగా మిగతా ఇద్దరు పురుషులు.

అత్తింటి వేధింపులకు వివాహిత..

పటాన్‌చెరు టౌన్: అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జిన్నారం మండలం జగంపేటకు చెందిన ఫకీర్, కరీంబీల చిన్న కూతురు నసీమాబేగం (29)కు అమీన్‌పూర్‌లో నివాసం ఉండే ఎండీ పాషాతో 2017లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కొంతకాలంగా భర్త, అత్త షలీఫా బేగం, బావ హమీద్, మరిది గౌస్ పాషా, తోడికోడళ్లు రెహానా బేగం, పర్వీన్‌లు.. నసీమా బేగంను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. ఈ విషయంలో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ చేసినా వారు తమ తీరును మార్చుకోకుండా వేధిస్తూనే ఉన్నారు. దీంతో ఈనెల 29న రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆమె ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి కరీంబీ శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేసుకోమన్నందుకు మనస్తాపం చెంది భర్త..


ఇస్మాయిల్ (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చిలప్‌చెడ్ మండలం బండపోతుగల్‌లో జరిగింది. శనివారం ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సయ్యద్ ఇస్మాయిల్ (38) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. రెండు రోజులుగా ఏ పని చేయకుండా మద్యం తాగుతూ తిరుగుతున్నాడు. దీంతో భార్య నాజియా రంజాన్ పండగ దగ్గరలో ఉంది ఖాళీగా తిరగక ఏదైనా పని చేసుకోవాలని చెప్పడంతో ఆమెతో గొడవపడి శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. గ్రామ శివారు పల్లె ప్రకృతి వనం ఆవరణలో చెట్టు కింద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు చూసి విషయాన్ని భార్యకు తెలుపగా ఇక్కడకు చేరుకొని భర్తను లేపి ఏమైందని అడగగా విషం తాగానని చెప్పాడు. వెంటనే స్థానికులు సహాయంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఇక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. నాజియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో తాపీమేస్త్రి


ప్రసాద్ మృతదేహం

మెదక్ మున్సిపాలిటీ: అప్పుల బాధతో తాపీమేస్త్రి ఉరివేసుకొని మృతిచెందాడు. ఈ సంఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దుర్గా కాలనీలో నివాసం ఉంటూ తాపీమేస్త్రి పనిచేసే భీమవరపు ప్రసాద్(41) ఇటీవల సొంత ఇల్లు కట్టుకున్నాడు. దీంతో అప్పులు బాగా పెరిగిపోయాయి. వీటిని ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురవుతున్నాడు. శనివారం ఉదయం గుడికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. పట్టణంలోని సాయి దత్తా థియేటర్ ఎదుట గల ఓ కార్యాలయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనపై విచారణ


ఆస్పత్రిలో విచారణ చేస్తున్న డీసీహెచ్ఎస్ సంగారెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ ప్రభుత్వాస్పత్రిలో మనూరు మండలం శెల్గిరకు చెందిన రోగి భర్త ప్రసాద్‌పై డాక్టర్ రాజ్‌కుమార్ ఇనుప రాడ్‌తో దాడి చేసిన ఘటనపై జిల్లా వైద్య విధాన పరిషత్ (డీసీహెచ్ఎస్) సమన్వయకర్త డాక్టర్ సంగారెడ్డి శనివారం విచారణ జరిపారు. ఏరియా ఆస్పత్రిలో బాధితులు, ఆస్పత్రి సిబ్బందితో వేర్వేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. తమనే ఆస్పత్రి వర్గాలు బెదిరిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సంగారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఇరు వర్గాల వద్ద వివరాలు సేకరించామన్నారు. నివేదికను కలెక్టర్, వైద్య విధాన పరిషత్ కమిషనర్‌లకు నివేదిస్తానని చెప్పారు. రోగులు, వారి కుటుంబీకుల పట్ల సమన్వయంతో మెలగాలని సూచించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ సతీష్, అసిస్టెంట్ సోయబ్, ఖేడ్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి ఉన్నారు.

సందడిగా రన్ ఫర్ జీసస్

ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముందస్తు వేడుకల్లో భాగంగా సంగారెడ్డి యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరమ్ ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా మీదుగా సీఎస్ఐ చర్చి వరకు జీసస్ పాటలకు నృత్యాలు చేస్తూ ఆటపాటలతో సందడిగా ముందుకు సాగారు. ఫాదర్ ఇన్నారెడ్డి భక్తులకు దైవ సందేశం అందించారు. కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి, తోపాజీ అనంత కిషన్, రూబెన్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, సునిల్, సల్మోహన్, వినయ్, ఫిలిప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో క్రైస్తవులు


నృత్యం చేస్తున్న యువతులు


యువతుల సందడి